క్లుప్తంగా

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



అయిజ: పట్టణానికి చెందిన లాజర్ కూతురు సంధ్యారాణి ఇటీవల జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే అబ్రహం పరామర్శించి ప్రభుత్వం తరఫున రూ.2లక్షల చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గట్టు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెన్నయ్య ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గొర్రెల పంపిణీ



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-1,2 గ్రామాల్లో బుధవారం గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు మండల పశు వైద్యాధికారిణి శిరీష తెలిపారు. ఒక్కో లబ్ధిదారుడికి 20 గొర్రెలు, ఒక పొట్టేల్ చొప్పున అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి పాల్గొన్నారు.

విరాళం అందజేత

గద్వాల: జిల్లా కేంద్రంలోని 23వ వార్డు తెలుగుపేట కాలనీ ప్రజలు కొన్నేళ్లుగా స్మశానవాటిక కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికకు అవసరమైన స్థలం కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. స్థలం కొనుగోలు నిమిత్తం బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కబీర్‌దాస్ నర్సింహులు తనవంతుగా రూ.55వేల విరాళం అందజేశారు. కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ముళ్లపొదలను తొలగించండి

అయిజ: ఆర్డీఎస్ కాల్వలో పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్ బుధవారం ప్రకటనలో కోరారు. ఆర్డీఎస్ కాల్వలో 20 రోజుల కిందట పూడికను తీసివేయడం, ముళ్లపొదల తొలగింపు పనులను ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం పనులను నిలిపివేయడంతో కాల్వలో నీరు రావడానికి అడ్డంకిగా మారిందన్నారు. అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలని కోరారు.

ఘనంగా ఉత్సవాలు

ఆత్మకూర్: రెండు రోజులుగా పట్టణంలో జరుగుతున్న హజ్రత్ సయ్యద్‌షా సాహెబ్ రహ్మతుల్లాఅలై, హజ్రత్ సయ్యద్ మౌలాన సాహెబ్ రహ్మతుల్లాఅలై ఉర్సు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రముఖ గాయకులు హాశం, గఫూర్, అమర్ మాస్టర్ ఆధ్వర్యంలో ఖవ్వాలీ కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి, ఖత్మే ఖురాన్, ఫాతేహ, దీపారాధన కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. మధ్యాహ్నం దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం జమేదార్ వీధి యువకులు గలీఫ్, చాదర్‌ను పురవీధుల గుండా ఊరేగించి దర్గాకు చేర్చారు.

ప్రముఖుల ప్రార్థనలు...

ఉర్సుకు వట్టెం షరీఫ్ పీఠాధిపతి ముర్షద్ ఖాజబాబా వఖలందరి ఛిస్తీమీర్జాయి సాహెబ్ ముఖ్య అతిథులుగా మాజరై ఫాతేహా నిర్వహించారు. ప్రముఖ పుత్రాలు శులాలు గుచ్చుకొని చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి, కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీను, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, రవియాదవ్, వైస్ ఎంపీపీ కోటేష్, కౌన్సిలర్ మండ్లరామకృష్ణ, నిర్వాహకులు ఎక్బాల్ బిన్ సయ్యద్, ఖమర్‌బిన్ సయ్యద్, బారిసాబ్, గయాసుద్దీన్, ఖలీల్, మినాజ్, మగ్బూల్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. నాగల్‌కడ్మూర్‌లో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి నిర్వహించి 40 క్వార్టర్ సీసాలు, 12 బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడు గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు. మండలంలో ఎవరైన అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- గుంతలమయంగా మారిన రోడ్లు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా మారిన మానవపాడు-చెన్నిపాడు రోడ్డు

మానవపాడు: గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలకేంద్రం నుంచి చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చండూరు, బోరవెల్లి, పల్లెపాడు, అమరవాయి, నారాయణపురం గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లు మొత్తం ధ్వంసమై గోతులు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. వర్షాలు పడితే రహదారులు మొత్తం నీటి కుంటలను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి..



రోడ్లు మొత్తం గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చెన్నిపాడు-మానవపాడు రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ గుంతలను గుర్తించలేకపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలి.

– చిన్నవెంకట్రాములు, మానవపాడు

ఇబ్బందులు పడుతున్నాం..



కలుకుంట్ల నుంచి మద్దూరుకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. కలుకుంట్ల బ్రిడ్జి వద్ద రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా ఉన్నధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– ఆత్మలింగారెడ్డి, సర్పంచ్, కలుకుంట్ల

టెంటర్ ప్రక్రియ పూర్తి కావాలి..

మానవపాడు రోడ్డుకు రూ.4కోట్లు, కలుకుంట్ల రోడ్డుకు రూ.3.40లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులను ప్రారంభిస్తాం. మండలంలో గుంతలమయంగా మారిన రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం.

– మహేష్, ఆర్అండ్‌బీ ఏఈ, మానవపాడు

అందుబాటులో జాతీయ జెండాలు



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

ఉండవెల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలను అందుబాటులో ఉంచినట్లు సబ్ పోస్ట్‌మాస్టర్ హిమాంవలీ తెలిపారు. మండల కేంద్రంలోని పోస్టాఫీస్ నుంచి జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో ఒక్కో జెండాను రూ.25కు విక్రయించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



తండావాసుల సమస్యలను తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

మల్దకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మద్దెలబండ పెద్దతండాలో జెడ్పీ చైర్‌పర్సన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి బస చేశారు. ఈ సందర్భంగా తండాలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. తండాలో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తాన్యానాయక్, కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బల్గెర నారాయణరెడ్డి, శంకర్, కృష్ణారెడ్డి, వెంకటేష్, శ్రీకాంత్‌గౌడ్, రఘు, మల్లారెడ్డి, నల్లారెడ్డి, గౌస్, దినేష్, మహాబూబ్‌పాషా, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేటీదొడ్డిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

అయిజ: ప్రభుత్వం రేషన్ డీలర్ల కమీషన్ రూ.90 నుంచి రూ.140కు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు ఈరన్న, శ్రీను, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రేషన్ డీలర్లు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు విజయ్, కృష్ణ, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. డీలర్లకు కమీషన్ పెంచిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఉరుకుందు, హనుమంతు, మిల్లు వీరన్న తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో..



అయిజలో..

బాధితుడికి ఆర్థికసాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం షాబాద్‌కు చెందిన తెలుగు పరుశరాముడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు బుధవారం బాధి తుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సేవాదళం నిర్వాహకుడు సోమ నాద్రి సూచన మేరకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మానవపాడు: మండలంలోని బోరవెల్లి, జల్లాపురం, చండూరు, పల్లెపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, చెన్నిపాడు, గోకులపాడు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ జుబెర్ మొహినుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఇటిక్యాల మండలం గోపల్‌దిన్నెలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. గోపల్‌దిన్నెకు చెందిన రాధాకృష్ణారెడ్డి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన కుర్వ నాగేష్ బైక్‌పై అజాగ్రత్తగా అతివేగంతో వచ్చి గ్రామ సమీపంలో ఢీకొట్టాడు. ప్రమాదంలో రాధాకృష్ణారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొర్రెల దొంగల అరెస్ట్

రాజోళి: మండల కేంద్రంలో ఈనెల 1న గొర్రెలను చోరీ చేసిన దొంగలను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఖాదర్‌బాషా తెలిపారు. కర్నూల్ జిల్లాకు చెందిన బోయ రామాంజనేయులు, గుడ్డి రామాంజనేయులు, వడ్డె శ్రీనివాస్, దానలింగడు గొర్రెలను చోరీ చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ధరూరు: పొలం వద్ద పశువులు మేపే క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కొండి ఆంజనేయులు, గవ్వల రామాంజీ రెండు రోజుల కిందట పశువులను మేపేందుకు వెళ్లారు. తమ పొలంలో పశువులు ఎందుకు మేపుతున్నావని ఇరువురి మధ్య గొడవ ప్రారంభమై దాడులు చేసుకున్నారు. బుధవారం ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



జూరాల నుంచి కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి బుధవారం కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్ రెగ్యులేటరీ వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు ప్రజల కష్టాలను గుర్తించిన కేసీఆర్.. తెలంగాణ వచ్చాక పాలమూరుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి బీడు భూములను సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. అప్పటి వలస జిల్లా నేడు అన్నపూర్ణ జిల్లాగా మారిందన్నారు.రైతులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండే ప్రభుత్వం తమదని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించి దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు వ్యవసాయం దండగ అంటే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పండుగ అని చేసి చూపిందన్నారు. నియోజకవర్గంలోని నెట్టెంపాడు ఎత్తిపోతలపాటు జూరాలతో ప్రతి ఎకరాకూ సాగునీరందించి రైతులను ఆర్థిక బాటలో నడిపించడమే లక్ష్యమన్నారు. జెడ్పీటీసీలు పద్మ, రాజశేఖర్, ఎంపీపీ విజయ్, వైస్‌ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు ఈశ్వరయ్య, సర్పంచులు శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు రమేష్‌నాయుడు, భగీరథ వంశీ, మునిరెడ్డి, ఈశ్వర్, హన్మంతురెడ్డి పాల్గొన్నారు.

గద్వాల రూరల్: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండలం పెంచికలపాడుకు చెందిన రాజేశ్వరికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.20వేల ఎల్‌వోసీని అందజేశారు. అదేవిధంగా రేషన్ డీలర్లు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకరమంలో వినియోగదారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎంపీపీ రాజారెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతికి మూలస్తంభాలు.. ఆదివాసీ గిరిజనులు



జిల్లెలపాడు తండావాసులతో సంపత్‌కుమార్

అలంపూర్ రూరల్/మానవపాడు: ఆదివాసీ గిరిజనులు తెలంగాణ సంస్కృతికి మూలస్తంభాలు అని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. అలంపూర్ మండలం జిల్లెలపాడు తండా, మానవపాడు మండలం చంద్రశేఖర్‌నగర్‌లో బుధవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన విద్యోన్నతి పథకం గిరిజనుల అభ్యున్నతికి ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. అనంతరం తండాలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అంతకుముందు సేవాలాల్ మహరాజ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి పూజలు చేశారు.

కేటీదొడ్డి: మండలంలోని పూజారితండాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, వెంకటేష్‌నాయక్, ఉరుకుందు, రాగూనాయక్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లిలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెడుతూ.. పేదల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహులు, నరేష్, బుగ్గన్న, రఘు పాల్గొన్నారు.

పశువులకు విధిగా టీకాలు వేయించాలి



వెంకటాపురంలో టీకాలు వేస్తున్న సిబ్బంది

అయిజ: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విధిగా టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కోరారు. మండలంలోని వెంకటాపురం, సింధనూరు గ్రామాల్లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 458 పశువులకు టీకాలు వేసినట్లు వెటర్నరీ సిబ్బంది తెలిపారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురం, తనగల గ్రామాల్లో 71మంది రైతులకు చెందిన 63 గేదెలు, 194 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పుష్పలత తెలిపారు. పశువులకు ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాకు భారీగా తరలిరావాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉండవెల్లి: సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఈనెల 12న చేపట్టిన మహాధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను బుధవారం అలంపూర్ చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా నుంచి 3వేలమందితో మహాధర్నాకు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణ, రాములు, శివప్రసాద్, మగ్బూల్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద మండలమైన అయిజలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పదేళ్లుగా వివిధ సంఘాల, పార్టీల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నర్సింహయ్యశెట్టి, మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, భగత్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్, ఓబీసీమోర్చా కార్యదర్శి వెంకటేష్ ఉన్నారు.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల వెల్లువ



కేటీదొడ్డిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



అలంపూర్ మున్సిపాలిటిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ నిత్యానంద్

అలంపూర్ రూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి బుధవారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. అలంపూర్ మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల నుంచి 324 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణను నిరంతరం కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నర్సింహ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని హడావుడిగా ప్రారంభించి దరఖాస్తు గడువు మూడు రోజులు మాత్రమే విధించడం సరికాదన్నారు. పేదలకు నష్టం వాటిల్లకుండా దరఖాస్తు ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకటస్వామి మాలిక్‌బాషా పాల్గొన్నారు.

కేటీదొడ్డి: గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహినుద్దీన్ తెలిపారు. మొదటిరోజు 225 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ సయ్యద్‌ఖాన్ పాల్గొన్నారు.

మానవపాడు: గృహలక్ష్మి పథకానికి 251 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రమణారావు తెలిపారు. మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉండవెల్లి: మండలంలో గృహలక్ష్మి పథకానికి 196మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా ఇటిక్యాలపాడు నుంచి 48మంది, ఉండవెల్లి నుంచి 35మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీఓ పద్మావతి, సీనియర్ అసిస్టెంట్ గౌరి తెలిపారు. కాగా దరఖాస్తు గడువు పెంచాలని సీఐటీయూ, బీఎస్పీ నాయకులు వెంకటేశ్వర్లు, హుస్సేన్‌బాషా, నాగరాజు, సురేష్, నర్సింహ, బాల్‌రాజు, మల్లికార్జున, ప్రభుదాసు డిమాండ్ చేశారు.

అయిజ: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం మద్యం టెండర్ల గడువు 15 రోజులు విధించగా, గృహలక్ష్మి దరఖాస్తుల గడువు మూడు రోజులుగా ప్రకటించడం శోచనీయమన్నారు. ఇంటి స్థలం లేని వారిని గుర్తించి ప్రభుత్వమే స్థలం కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు.